సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
90324 97123
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఒడిశా గవర్నర్‌ను కలిసిన బీజేపీ నాయకులు



గవర్నర్ హరిబాబుతో బీజేపీ నాయకులు

డాబాగార్డెన్స్: ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబును ఆంధ్రప్రదేశ్ బీజేపీ మెడికల్ సెల్ కన్వీనర్ రూపాకుల రవికుమార్, వైజాగ్ బీజేపీ మెడికల్ సెల్ కన్వీనర్ వెంకటేశ్వరరావు, సభ్యురాలు భాగ్యలక్ష్మి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసారు.

కొట్లాట నేపథ్యంలో ఇద్దరిపై కేసు నమోదు

సీతమ్మధార: సీతంపేటకు చెందిన రౌడీషీటర్ బాబులు (40) తన స్నేహితుడిని తిట్టాడని సోమవారం రాత్రి అదే ప్రాంతానికి చెందిన వినయ్ (23) అనే యువకుడి ఇంటికి వెళ్లి అతనిపై దాడికి పాల్పడటమే కాకుండా కుటుంబ సభ్యులపై దురుసుగా ప్రవర్తించాడు. తర్వాత కొద్ది గంటలకు వినయ్ తన స్నేహితుడితో కలిసి బాబులు ఇంటికి మాట్లాడటానికి వెళ్లడంతో అక్కడి నుంచి తప్పించుకున్నాడు. రౌడీషీటర్ తనకు ఏమీ తెలియనట్టు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. ఆ తర్వాత వినయ్ కుటుంబ సభ్యులు సైతం తమపై దాడికి దిగినట్లు ఫిర్యాదు చేయగా ఇద్దరిపై కేసు నమోదు చేశారు.


నీతి కథలతో ఉన్నత భావాలు



కథలు చదువుతున్న విద్యార్థులు

మురళీనగర్: విద్యార్థులు నీతి కథలు చదవడం వల్ల ఉన్నత భావాలు ఏర్పడతాయని గ్రంథాలయ ఉద్యమకర్త దత్తి అప్పలనాయుడు అన్నారు. మురళీనగర్ శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం నీతి కథల పఠన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పెద్దల పట్ల గౌరవం, జీవితాన్ని క్రమశిక్షణతో గడపడం అలవాటు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించారు. కథలు చెప్పించి, కథలు చదివించారు. లైబ్రేరియన్ వై.పద్మజ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీచర్ విజయలక్ష్మి పాల్గొని విద్యార్థులకు కథలు చెప్పారు.

సత్యకుమారికి నారీశక్తి అవార్డు




నారీశక్తి అవార్డు అందుకుంటున్న సత్యకుమారి

సీతంపేట: నగరానికి చెందిన సామాజిక సేవకురాలు డబ్ల్యూ.సత్యకుమారికి ప్రతిష్టాత్మకమైన నారీశక్తి అవార్డు లభించింది. ప్రజలు, విద్యార్థులకు సత్యకుమారి చేస్తున్న సేవను గుర్తించిన న్యూఢిల్లీకి చెందిన దూశ్రా దర్పక్ ఫౌండేషన్ ఈ అవార్డుకు ఎంపిక చేసింది. ఉమెన్ లీడర్ ఆఫ్ ది ఇయర్ కేటగిరీలో అవార్డును ప్రకటించారు. ప్రముఖ నటి సుధా చంద్రన్, మిసెస్ ఇండియా మంజరి చేతుల మీదుగా అవార్డు స్వీకరించారు. సత్య కుమారి 14 ఏళ్లుగా నగరంలో బీపీవోగా విధులు నిర్వర్తిస్తూ, విధి నిర్వహణ, కుటుంబ బాధ్యతలు చూసుకుంటూ, నగరంలో పలు ప్రాంతాలలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వర్తిస్తున్నారు. సమాజంలో మహిళా ప్రాధాన్యత, ఆర్థికాభివృద్ధి వంటి అంశాలపై పాఠశాల, కళాశాల స్థాయి నుంచి విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. సత్యకుమారికి కుటుంబ సభ్యులు,స్నేహితులు అభినందనలు తెలిపారు.

ఆటలో మెరిసి.. శిక్షణతో మురిసి

- కిక్ బాక్సింగ్‌లో గణతికెక్కిన పాతనగర వాసి
- కిక్ బాక్సర్ నుంచి పోటీల్లో న్యాయనిర్ణేతగా ఎదిగిన దుర్గా
- ఇప్పటి వరకు ఎన్నో మెడల్స్
- తాజాగా రిఫరీగా రాణింపు





విజయంతో విశాఖ వచ్చిన దుర్గాకు స్వాగతం పలుకుతున్న అభిమానులు, కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు

డాబాగార్డెన్స్: కిక్ బాక్సింగ్ అనేది పంచింగ్.. కికింగ్ ఆధారంగా పూర్తి కాంటాక్ట్ హైబ్రిడ్ మార్షల్ ఆర్ట్. బాక్సింగ్‌లో ఓ రకం. 1950–70 మధ్యలో ఉద్భవించింది. ఈ పోరాటం బాక్సింగ్ రింగ్‌లో జరుగుతుంది. సాధారణంగా బాక్సింగ్ గ్లోవ్స్, మౌత్ గార్డ్స్, షార్ట్స్, బేర్ కాళ్లతో కిక్‌ల వాడకానికి అనుకూలంగా ఉంటుంది. కిక్ బాక్సింగ్ ఆత్మరక్షణ, సాధారణ ఫిట్‌నెస్, పోటీ కోసం అభ్యసిస్తారు. కిక్ బాక్సింగ్ పదం 1960లో జపాన్‌లో ఉద్భవించింది. పాతనగరానికి చెందిన టెంకి దుర్గా పదో తరగతి వరకే చదువుకున్నాడు. కిక్ బాక్సింగ్‌పై మక్కువతో ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం వేదికగా కోచ్ జి. ఆనంద్‌బాల్ వద్ద 2000లో చేరాడు. శిక్షణలో ఆరితేరాడు. అప్పటి నుంచి జిల్లా.. రాష్ట్రస్థాయి పోటీల్లో పరాజయం తెలియకుండా విజయాలతో దూసుకుపోతూ రాణించాడు. అక్కడి నుంచి జాతీయ స్థాయి పోటీలకు ఎదిగాడు. జాతీయ స్థాయిలో ఏడు సార్లు పార్టిసిపేట్ చేసి విజయం సాధించుకుంటూ వచ్చాడు.

ఎంతో మందికి శిక్షణ..

టెంకి దుర్గా తను నేర్చిన కళను పలువురు యువత నేర్పుతున్నాడు. మున్సిపల్ స్టేడియం వేదికగా ఉదయం.. సాయంత్రం వేళల్లో ప్రాక్టీస్ ఇస్తున్నాడు. చదివింది నామమాత్రమైనా.. తను నేర్చుకున్న విద్యను ఓ గురువుగా ఎంతో మందికి అందజేస్తూ వారిని తీర్చి దిద్దుతున్నాడు.

దేశంలోని జమ్ము అండ్ కాశ్మీర్, కోల్‌కత్తా, సోలాపూర్ (మహారాష్ట్ర), పాండిచ్చేరి, ఢిల్లీ (రెండు సార్లు), మొరిబిల్లి (కోల్‌కత్తా)లో జరిగిన జాతీయ కిక్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొని తనదైన శైలిలో ప్రత్యర్థులపై విరుచుకుపడి గెలిచాడు. పాల్గొన్న ప్రతిచోటా మెడల్స్ సాధించాడు. 2007లో భువనేశ్వర్‌లో జరిగిన పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి తొలిసారిగా ప్రోబెల్ట్ సాధించాడు. 2018లో రష్యాలో జరిగిన 9వ డైమండ్ వరల్డ్ కిక్ బాక్సింగ్‌లో బ్రాంజ్ మెడల్ సాధించాడు. 2021లో ఇటలీలో జరిగిన పోటీల్లో విజయం చివరి వరకు వెళ్లాడు

రిఫరీగా..



2000లో కిక్ బాక్సింగ్ శిక్షణలో చేరిన టెంకి దుర్గా.. అంచెలంచెలుగా ఎదుగుతూ ఇటు విశాఖకే కాక.. రాష్ట్రానికి.. దేశానికి పేరు సాధించి పెడుతూ శిక్షణ పొందిన నాటి నుంచి శిక్షణ ఇవ్వడం.. పోటీలో న్యాయ నిర్ణేత స్థాయికి ఎదిగాడు. ఈ నెల 7 నుంచి 12 వరకు థాయిలాండ్‌లో జరిగిన మొదటి థాయ్‌లాండ్ వరల్డ్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో రిఫరీగా వ్యవహరించాడు. యావత్ దేశం నుంచి ఇద్దరే రిఫరీలుగా నియమితులయ్యారు. అందులో టెంకి దుర్గాతో పాటు వాసుపల్లి సతీష్ ఎంపికయ్యారు.



థాయిలాండ్‌లో జరిగిన మొదటి థాయ్‌లాండ్ వరల్డ్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో రిఫరీగా వ్యవహరిస్తున్న దుర్గా (ఫైల్)

పేదలకు వస్త్రదానం



పేదలకు వస్త్రదానం చేస్తున్న డాక్టర్ జహీర్ అహ్మద్, ద్రోణంరాజు శ్రీవత్సవ్

డాబాగార్డెన్స్: సీనియర్ పాత్రికేయుడు (సాక్షి), సంఘ సేవకుడు ఎం. అచ్చిరాజు వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం స్వామి వివేకానంద సంస్థ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా అచ్చిరాజు చిత్రపటానికి సంస్థ గౌరవ అధ్యక్షుడు, ప్రముఖ వైద్యుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్, వైఎస్సార్‌సీపీ కార్యదర్శి ద్రోణంరాజు శ్రీవత్సవ్, సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, పలువురు సభ్యులు నివాళులర్పించారు. అనంతరం వారి చేతుల మీదుగా పేదలకు వస్త్రదానం చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అచ్చిరాజు పాత్రికేయుడిగా ఎన్నో సేవలందించారని, వివేకానంద సంస్థకు సేవలందిస్తూ మానవతా వాదిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ఈశ్వరరావు, సత్తిబాబు, పోలవరపు అప్పలకొండ, సీహెచ్ పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

చక్కగా కథలు చెప్పారు



అల్లిపురం శాఖా గ్రంథాలయంలో కథలు చెబుతున్న విద్యార్థులు

అల్లిపురం: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా అల్లిపురం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులు చక్కని కథలు వినిపించారు. ముఖ్య అతిథిగా విశ్రాంత రైల్వే ఉగ్యోగి వీఎస్ఎన్ రెడ్డి పాల్గొని విద్యార్థులు చెప్పిన కథలు, వాటి సారాంశాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో గ్రంథాలయానికి వచ్చి విజ్ఞానం పెంచుకోవాలన్నారు. గ్రంథాలయంలో రామాయణం, భారతం, భాగవతం వంటి గ్రంథాలే కాక రాజకీయ, సామాజిక రంగాలకు చెందిన కథల పుస్తకాలు, దినపత్రికలు, విజ్ఞానాన్ని అందించే జీకే, చరిత్ర పుస్తకాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని గ్రంథాలయ అధికారి పీవీఎస్ రాజు కోరారు.

వేడుకగా అంతర్జాతీయ నృత్య దినోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థులు

సీతమ్మధార: డాక్టర్స్ కాలనీలో ఉన్న నాట్యం నాట్య కళా క్షేత్రంలో అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. భరతనాట్య కళకు ప్రసిద్ధి చెందిన నాట్యం నాట్య కళా క్షేత్ర అకాడమీ నాట్య గురువులు కె. వెంకట్ చిన్నారావు ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. నాట్య కళా క్షేత్ర విద్యార్థులు ఈ సందర్భంగా భరతనాట్యంలోని సాంప్రదాయ నృత్యాలు, హస్త ముద్రలు, శ్లోకాలు ప్రదర్శించారు. పుష్పాంజలి, అలరింపు, శ్లోక నాట్యం, కీర్తనం, శబ్దం, థిల్లానా వంటి నృత్యాలను విద్యార్థులు ప్రదర్శించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇందులో రెగ్యులర్ విద్యార్థులతో పాటు ఆన్‌లైన్ ద్వారా నృత్యం అభ్యసిస్తున్న విద్యార్థులు కూడా పాల్గొన్నారు. ఫౌండర్, ప్రెసిడెంట్ అయిన డాక్టర్ కె. మాధవి, నాట్య గురువు వెంకట్ వేడుకలో పాల్గొన్న ప్రతి విద్యార్థిని అభినందించారు. ఈ కార్యక్రమానికి కో– ఆర్డినేటర్‌గా డి. రాజేష్ వ్యవహరించారు. ఈ సంబరాలను సీనియర్ విద్యార్థులు పి. సాయి అక్షిత, వి. కమల స్వేతిక తమ యాంకరింగ్‌తో విజయవంతంగా నిర్వహించారు. గెలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

ఘనంగా షిర్డీసాయి ధ్యాన మందిరం వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో అక్కయ్యపాలెం షిర్డీసాయి



సాయి సత్య వ్రతంలో పాల్గొన్న భక్తులు

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెం రామకృష్ణానగర్‌లో కొలువైన శ్రీ షిర్డీ సాయి ధ్యాన మందిరం 16వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబాకు పంచామృతాభిషేకం, 1008 లడ్డూలతో సహస్ర నామార్చన, మంత్రపుష్పం, ఆశీర్వచనం, ప్రసాద వితరణ జరిపారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. పరిసర ప్రాంత భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాదం స్వీకరించారు. సాయంత్రం సామూహిక సాయి సత్య వ్రతం జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వ్రతం ఆచరించారు. బుధవారం సాయంత్రం బాబా వారి శోభాయాత్ర జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ బొడ్డేటి కిరణ్‌కుమార్ తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శోభాయాత్రను జయప్రదం చేయాలని కోరారు.

హనీ గ్రూప్ మెగా రక్తదాన శిబిరం

ఎంవీపీకాలనీ: హనీ గ్రూప్ ఆధ్వర్యంలో మంగళవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఎంవీపీ కాలనీలో ఉన్న కార్యాలయంలో నిర్వహించిన ఈ శిబిరానికి ఉద్యోగులతో పాటు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. ఎన్టీఆర్ ట్రస్ట్, ఏఎస్ రాజా, రోటరీ క్లబ్ విశాఖ వ్యాలీ, రోటరీ క్లబ్ విజయనగరం, మదర్, అమ్మ, విజయశ్రీ, విమ్స్, లైఫ్‌షేర్ బ్లడ్ సెంటర్ల సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో 530 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా హనీ గ్రూప్ వ్యవస్థాపకుడు ముక్కా ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ ప్రాణాలను కాపాడే కార్యక్రమంలో భాగస్వాములవడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరాన్ని ఉద్యోగుల నుంచే కాకుండా ప్రజల నుంచి కూడా మంచి స్పందన రావడం ఆనందంగా ఉందన్నారు. ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడంలో వ్యాపారులు చురుకైన పాత్ర పోషించడానికి ఈ కార్యక్రమం ఒక స్ఫూర్తిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులతో ధర్నా చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

సీతమ్మధార: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు పి.మణి వారికి మద్దతు నిలిచి మాట్లాడారు. ఆరోగ్య శాఖలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా వేతన సవరణ చేయాలన్నారు. వీరి పోరాటానికి సీఐటీయూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు ఎం.ఎస్.ఎన్. ప్రజ్ఞ, కార్యదర్శి గంట సుధ మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం 6 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సీహెచ్‌వోలను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలని, ఈపీఎఫ్ పునరుద్ధరించాలని, క్లినిక్ అద్దె బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. హెచ్ఆర్ పాలసీ, ఇంక్రిమెంట్, ట్రాన్స్‌ఫర్, ఎక్స్‌గ్రేషియా మొదలగునవి అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు జి. సుధారాణి, పి.దివ్య, బి. శ్రావణి, టి.మోషే, జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

పోర్టులో అంబేడ్కర్ జయంతి



టెన్త్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో వీపీఏ చైర్‌పర్సన్ అంగముత్తు తదితరులు

విశాఖ సిటీ: విశాఖ పోర్ట్ అథారిటీలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి నిర్వహించారు. మంగళవారం వీపీఏ పరిపాలన భవనంలోని సాంబమూర్తి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో పోర్టు చైర్‌పర్సన్ డాక్టర్ ఎం.అంగముత్తు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దార్శనికుడు అంబేడ్కర్ నాయకత్వంలో రూపొందించిన భారత రాజ్యాంగం దేశానికి మార్గనిర్దేశం చేస్తుందని పేర్కొన్నారు. అనంతరం పదో తరగతి పరీక్షల్లో చక్కటి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెరిటోరియస్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీపీఏ డిప్యూటీ చైర్‌పర్సన్ దుర్గేష్‌కుమార్ దుబే, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ పి.ఎస్.ఎల్.స్వామి, వీపీఏ ఎస్సీ, ఎస్టీ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఉమామహేశ్వరరావు, కార్యదర్శి ఎం.దేవీశ్వరరావు, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఒ.రామలింగం, కార్యదర్శి జి.శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బుద్ధ విహార్ ఆలయ నిర్వహణ బౌద్ధులకే అప్పగించాలి



జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ ప్రతినిధులు

డాబాగార్డెన్స్: మహా బుద్ధ విహార్ ఆలయ నిర్వహణ బౌద్ధులకే అప్పగించాలని జిల్లా రెవెన్యూ అధికారి, అదనపు జిల్లా మెజిస్ట్రేట్ బీహెచ్ భవానీ శంకర్‌కు ఉత్తరాంధ్ర జిల్లాల్లో గల బౌద్ధ సంఘాల ఐక్య జేఏసీ ప్రతినిధులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. మహా బోధి మహావిహార్ విముక్తి ఆందోళనకు సపోర్ట్ చేస్తూ బుద్ధ విహార్ ఆలయ నిర్వహణ బౌద్ధులకే అప్పగించాలని, 1949 బీటీ యాక్ట్‌ని రద్దు చేయాలని కోరారు. రెవెన్యూ అధికారిని కలిసిన వారిలో మహాబోధి మహా విహార్ విముక్తి ఆందోళన, ఉత్తరాంధ్ర జిల్లాల జేఏసీ కన్వీనర్ వీవీ దుర్గారావు, కో కన్వీనర్ బీవీజీ గౌతమ్, కోశాధికారి కర్రి సత్యనారాయణ, సభ్యుడు సింహాద్రి, భీమ్‌సేన్ వార్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వసంత రాజేంద్రప్రసాద్, బౌద్ధ ఉపాసకులు, ఉపాసికులు, అంబేడ్కరీయులు తదితరులు ఉన్నారు.

మేయర్‌కు పలువురి అభినందన



మేయర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

అల్లిపురం: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు మేయర్ పీలా శ్రీనివాసరావును మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లా కిరణ్‌కుమార్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు పీజే గణేష్‌కుమార్, బీవీ అశోక్‌కుమార్, ఈ పవన్‌కుమార్, బంగార్రాజు, సాయికృష్ణ, నానాజీ తదితరులు పాల్గొన్నారు.

మేయర్‌కు అభినందనలు..

డాబాగార్డెన్స్: మేయర్ పీలా శ్రీనివాస్‌ను జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ లేబర్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు మహాదేవ్ ఆనందరావు నేతృత్వంలో పలువురు యూనియన్ నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అధ్యక్షుడు రెల్లి సత్యం, పలువురు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

డీఎస్సీలో నాన్‌లోకల్ శాతాన్ని తగ్గించాలని వినతి

ఎంవీపీకాలనీ: డీఎస్సీ నోటిఫికేషన్‌లో నాన్‌లోకల్ శాతాన్ని తగ్గించాలని నిరుద్యోగుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్ కోరారు. ఈ మేరకు ఎంవీపీకాలనీలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. డీఎస్సీలో నాన్‌లోకల్ పోస్టులుగా రాష్ట్ర ప్రభుత్వం 20 శాతం కేటాయించిందని, గతంలో తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీలో నాన్‌లోకల్‌కు కేవలం 5 శాతం పోస్టులే కేటాయించిందని గుర్తు చేశారు. ఉద్యోగ వయోపరిమితిని 47 ఏళ్లకు పెంచాలని కోరారు.



భద్రం బీకేర్‌ఫుల్ బ్రదరు..

వన్‌టౌన్‌లోని రామకృష్ణా జంక్షన్‌లో మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారింది. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే ఈ జంక్షన్‌లో మ్యాన్‌హోల్‌కు ఐరన్ గ్రిల్ లేనప్పటికీ జీవీఎంసీ సిబ్బంది పట్టించుకోకపోవడంతో స్థానికులే వాహన చోదకులకు ప్రమాదం జరగకుండా ఉండేందుకు అందులో ఒక కర్ర పెట్టి వస్త్రాలు కట్టారు.

– ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

విజేతగా నిలిచిన వరప్రసాద్ ఎలెవెన్స్ జట్టు

మురళీనగర్: మేడే సందర్భంగా మాధవధార క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో వెటరన్ క్రికెటర్స్ ట్రోఫీని మంగళవారం నిర్వహించారు. జింక్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఫైనల్స్‌లో సనపల వరప్రసాద్ ఎలెవెన్స్ జట్టు విజేతగా నిలిచింది. 10 ఓవర్ల మ్యాచ్‌లో వావిలపల్లి ప్రసాద్ జట్టుపై సనపల వరప్రసాద్ ఎలెవెన్స్ జట్టు గెలిచింది. మాధవధార క్రికెట్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు సనపల సూర్యనారాయణ, సనపల రామ్ గోపాల్ సంయుక్తంగా మ్యాచ్ ప్రారంభించారు. వరప్రసాద్ కెప్టెన్సీలో మొదట బ్యాటింగ్ చేసిన వరప్రసాద్ ఎలెవన్స్ నిర్ణీత 10 ఓవర్లలో 90 పరుగులు సాధించింది. ఆ జట్టు బ్యాటర్ జీవీ ఆనందరావు 20 బంతుల్లో 44 పరుగులు సాధించి అత్యధిక స్కోరర్‌గా నిలిచాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన వావిలపల్లి ప్రసాద్ టీమ్ 52 పరుగులు మాత్రమే చేసింది. వరప్రసాద్ ఎలెవెన్స్ జట్టు 38 పరుగుల ఆధిక్యంతో ట్రోఫీ గెలుచుకుంది. వరప్రసాద్ ఎలెవెన్స్ బౌలర్ సనపల నాగచంద్రుడు మూడు వికెట్లు తీశాడు. ఎన్‌టీఎస్ కుమార్, వి. వెంకట్రావు, వి. ప్రసాద్, రమేష్ మ్యాచ్ నిర్వహణకు సహకరించారు. విజేత జట్టుకు మేడే సాయంత్రం మాధవధార సమాజ ఆవరణలో నిర్వహించనున్న కార్యక్రమంలో బహుమతి అందిస్తామని నిర్వాహకులు తెలిపారు.



కొనసాగుతున్న రిలే నిరాహారదీక్షలు



ఎన్ఎంయూఏ నిరాహార దీక్షల్లో పాల్గొన్న ఆర్టీసీ ఉద్యోగులు

ఎంవీపీకాలనీ: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎన్ఎంయూఏ (నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్) వాల్తేర్ డిపో ఉద్యోగులు చేపట్టిన రిలే నిరాహారదీక్షలు 2వ రోజు కొనసాగాయి. ఎన్ఎంయూఏ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమస్యల పరిష్కారానికి ఉద్యోగులు ఈ దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం డిపో కార్యదర్శి ఆర్.వసంతరావు మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. నైట్ అలవెన్స్‌లను రూ.150 నుంచి రూ.400లకు పెంచాలన్నారు. దీంతోపాటు త్వరలో వినియోగంలోకి రానున్న ఎలక్ట్రికల్ బస్సులను సంస్థ ఉద్యోగుల ద్వారానే నడపాలని, ఈహెచ్ఎస్ స్థానంలో ఉద్యోగులకు పాతవిధానంలోనే వైద్య సదుపాయాలు అందించాలని డిమాండ్ చేశారు. గ్యారేజ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, అక్రమ సెస్పెన్షన్, అక్రమ రిమూవల్స్ ఆపాలని, డబుల్ డ్యూటీకి వచ్చే అలవెన్స్‌లను పెంచాలని కోరారు. సమస్యలు పరిష్కరించే వరకు దీక్షలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వీయూఎం రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నూర్జహాన్, రీజనల్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.ఈ.రావు, సీసీఎస్ డెలిగేట్లు కేటీ రావు, పి.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

